
# **The Man who never lost his Temper**

## (ఎన్నడూ సహనాన్ని కోల్పోవని మహనీయుడు)




మా గుంటూరు మెడికల్ కాలేజి మిత్రులం డా. E.N.B. శర్మ గారితో (ఈశ్వర నృసింహేశ్వర భగీరథ శర్మ) ఉన్న అనుభవాలను అప్పుడప్పుడు పంచుకోవడం జరుగుతూ ఉండేది. శర్మ గారి గురించి డా. భార్గవి రాసిన Facebook లో పోస్ట్ చూసి వారి విద్యార్థులు, బంధువులు ఎంతో మంది శర్మ గారి గొప్పతనాన్ని, వారితో ఉన్న తమ అనుభవాలను నెమరువేసుకొని పునరుత్తేజితులవ్వడం చాలా సంతోషాన్నిచ్చింది. నన్ను కూడా వారి గురించి రాయమని డా. భార్గవి ప్రోత్సహించారు.

శర్మ గారికి నేనంటే చాలా ఇష్టం – నేనే కాదు, మా గుంటూరు మెడికల్ కాలేజీలోని ఆయన విద్యార్థులందరూ ఇలానే అనుకొంటారు. ఎందుకంటే ఆయన అందరినీ బేషరుతుగా ప్రేమించేవారు. అందుకే అందరూ వారిని ఇప్పటిదాకా మర్చిపోలేదు. మేము క్లినిక్స్ లోకి వచ్చిన తరువాత ఆయన వైజాగ్ నుండి బదిలీ అయి S2 Chief గా ఉన్నారు. మంగళవారం ఆ యూనిట్ OP చూసే రోజు. ఆయన వచ్చిన అతి కొద్ది కాలంలోనే మంగళవారం సర్జికల్ OP కి రోగులు విపరీతంగా పెరిగారు. GGH లోనూ, మెడికల్ స్టూడెంట్స్ లోనూ, చుట్టుప్రక్కల ఊళ్లలోనూ శర్మ గారి నిజాయితీ, సామర్థ్యం గురించి కథలుకథలుగా చెప్పుకునేవారు.

గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో ఆయన దినచర్య :

ఉదయం 8.30 లోపే తన నల్ల కారులో తానే వేగంగా నడుపుకుంటూ వచ్చి క్యాంటీన్ ముందు ఉన్న షెడ్ లో పార్క్ చేసేవారు. కారు లోంచి బ్రీఫ్ కేస్ తీసుకొని వడివడిగా నడుచుకుంటూ మెట్లెక్కి S2 వార్డులోకి వెళ్ళేవారు. చీఫ్ లు అందరూ వాళ్ళ రూము లోకి వెళ్ళి కూర్చోవడం రివాజు. కానీ శర్మ గారు వార్డు లోని బల్ల మీద బ్రీఫ్ కేస్ పెట్టి మొదటి బెడ్ దగ్గరకి వెళ్ళి రౌండ్స్ మొదలుపెట్టేవారు. అసిస్టెంట్స్, PG లు, నర్సులు, S2 వార్డు మెడికల్ స్టూడెంట్సే కాక శర్మ గారు రౌండ్స్ లో చెప్పే పాయింట్స్ వినాలనే ఆసక్తి   మిగతా వార్డులలోని స్టూడెంట్స్ కూడా ఆ రౌండ్స్ ఫాలో

అయ్యేవారు. Theory క్లాసులో కంటే వారు రౌండ్స్ లో చెప్పే విషయాలు మరింత ఆసక్తిగా ఉండేవి. ఆయన రౌండ్స్ లో వైద్యపరమైన విషయాలే కాక సాంఘిక పరమైన విషయాలపై కూడా తన అభిప్రాయాలను చెప్పేవారు. పొగ త్రాగడం వలన కాన్సర్ వచ్చిన ఒక పేషెంట్ ను పరీక్ష చేసిన తరువాత 'ప్రభుత్వం సిగరెట్లను ఎందుకు బ్యాన్ చేయదు?' అని బాధ పడ్డారు. రోగుల పట్ల ఎంతో శ్రద్ధ, దయ ఉండేది వారికి. వారి నోటి వెంట వచ్చే ప్రతి మాటను చాలా శ్రద్ధగా వినేవాళ్లం. వైద్య విద్యార్థిగా నేను ఆయన వార్డు కాదు. కానీ వీలుకుదిరినప్పుడల్లా ఆయన రౌండ్స్ ను నేను ఫాలో అవుతుండేవాడిని. అవిభక్త ఆంధ్రప్రదేశ్ లోని మొట్టమొదటి సర్జికల్ ఆంకాలజిస్ట్ డా. సింహాద్రి చంద్రశేఖర్ వీరి యూనిట్ లో PG చేస్తుండేవారు. PG లు తన క్రింద నేర్చుకొనే విద్యార్థులే అయినా వారిని చాలా గౌరవంగా సంబోధించేవారు. ఒక్కొక్కసారి PG లను సలహాలు కూడా అడిగేవారు. వారిలో అహంకారాన్ని నేనే కాదు – ఎవ్వరూ చూసి ఉండరు.

Male వార్డు లో రౌండ్స్ అవగానే Female వార్డులో రౌండ్స్ చేసేవారు. అక్కడ పనిపూర్తవగానే రేడియాలజీ డిపార్ట్మెంట్ కు వెళ్ళి తమ పేషెంట్స్ కు బేరియం మీల్, బేరియం ఎనిమా ల గురించి రేడియాలజిస్ట్ తో మాట్లాడేవారు. ఆ తరువాత క్యాంటీన్ కు వెళ్ళి కాఫీ తాగేవారు. ఈ అన్ని చోట్లకు ఆయన వెనుక S2 అసిస్టెంట్స్, PG లు వెళ్తూనే ఉండేవారు.

హాస్పిటల్ లో పని అయిపోయిన తరువాత తన నల్ల కారు నడుపుకుంటూ కాలేజీ కి వచ్చి మైక్రో బయాలజీ డిపార్ట్మెంట్ కు వెళ్ళి కాసేపు విశ్రాంతి తీసుకొనేవారు. వారి శ్రీమతి డా. అన్నపూర్ణ గారు మాకు మైక్రో బయాలజీ ప్రొఫెసర్. సాయంత్రం 4 గంటలకు అన్నపూర్ణ మేడమ్ డ్యూటీ అవగానే మేడమ్ ను తీసుకుని ఇంటికి వెళ్లిపోయేవారు.

సాయంత్రాలు చీఫ్ ల ఇంటికి వెళ్ళి కలిసి కాస్త డబ్బు ముట్టచెప్పడం అనే అలవాటు ఆ కాలం లో రోగులకు ఉండేది. అలా అయితేనే వార్డులో చేర్చుకునేవారు కొందరు. కానీ శర్మ గారి ఇంటికి ఎన్నడూ ఏ రోగీ ఏ రోజూ వెళ్ళిన దాఖలాలు లేవు. నేను మాత్రం ఒకరోజు వారింటికి వెళ్ళాను. (ఎందుకో తరువాత చెప్తాను....)

ఆపరేషన్ థియేటర్ లో :

OT రోజు అయితే కారు పార్క్ చేయగానే సరాసరి ఆపరేషన్ థియేటర్ కు వెళ్లిపోయేవారు. 9 గంటలలోపే మొదటి కేసు మొదలయ్యేది. ఆపరేషన్లు చాలా వేగంగా చేసేవారు. నేను హౌస్ సర్జన్సీ లో ఉన్నప్పుడు వారి వార్డులోనే పనిచేశాను. వారికి కొన్ని కేసులు assist చేసే అదృష్టం నాకు కలిగింది. నేను assist చేసిన GJ + Vagotomy కేసును ఆయన Skin to Skin కేవలం 16 నిముషాలలో పూర్తి చేశారు. మిగతా సర్జన్స్ 45 నిముషాల నుండి గంటన్నర వరకు తీసుకొనే ఈ శస్త్ర చికిత్సను ఆయన 12 నిమిషాలలో పూర్తి చేయడం మేము చూశామని ఆరోజు నాకు PG లు చెప్పారు. ఒక యూనిట్ కు రెండు వారాలకు మూడు సార్లు థియేటర్ రోజులు ఉండేవి. శర్మ గారి వార్డు వారు థియేటర్ లో ఎక్కువ కేసులు పోస్ట్ చేసేవారు. 14 నుంచి 16 కేసుల దాక పోస్ట్ చేసిన రోజులు కూడా ఉండేవి. OT లో రెండు టేబుల్స్ లో సర్జరీ లు జరుగుతూ ఉండేవి. ఒంటి గంట తరువాత మత్తు డాక్టర్లు మత్తు ఇచ్చే వారుకాదు. లిస్ట్ పూర్తి చేయడానికి Hydrocele ఆపరేషన్లను ట్రాలీ మీద చేయించేవారు. కొంతకాలం తరువాత కొత్తగా వచ్చిన Anesthesia Professor ఈ Third table ఆపరేషన్లకు మత్తు ఇవ్వడం నిరాకరించారు.

లిస్ట్ పూర్తి చేయడానికి షిఫ్టింగ్ ఆలస్యం అవుతుందనుకుంటే ఆయనే ట్రాలీ ని స్వయంగా తోసుకుంటూ వెళ్ళేవారు. ఆపరేషన్ చేయాల్సిన రోగి శరీర భాగాన్ని ప్రిపరేషన్ చేయకుండా ఆపరేషన్ టేబుల్ పై పేషెంట్ ను పడుకోబెడితే మరో Professor అయితే చచ్చేట్టు అందరినీ తిట్టేవారు. కానీ శర్మ మాష్టారు ఎవర్నీ ఏమీ అనకుండా ఒక రేజర్ తీసుకొని తానే షేవ్ చేసేస్తూ ఉండేవారు. 'మన క్రింద పనిచేసేవారిపై మనకు కంట్రోల్ ఉండాలంటే ఎనిమా చేయడం, ప్రిపరేషన్ చేయడంతో సహా వారు చేసే పనులన్నీ మనం కూడా చేయగలిగి ఉండాలి ప్రసాదూ' అన్నారు నాతో ఒకసారి.

## ఆపరేషన్లు వేగంగా చేయడం ఎందుకు?

'ఎందుకు సార్ ఇంత స్పీడ్ గా ఆపరేషన్లు చేస్తుంటారు' అని అడిగాను కుతూహలం కొద్దీ.

'డాక్టర్ అయిన తరువాత నేను సొసైటీ కి ఎలా సర్వీస్ చేయగలనని ఆలోచించాను. రెండు దారులు నాకు కనిపించాయి.
1) వైద్య పరిశోధన చేసి ప్రజలకు పనికొచ్చే అంశాన్ని కనిపెట్టడం.
2) వీలైనంత ఎక్కువ మంది రోగులను చూసి వారి బాధలను తగ్గించడం.

రీసర్చ్ చేసే అవకాశాలు మన దేశంలో కనిపించలేదు. నేను సర్జన్ ని కాబట్టి నాకున్న తక్కువ సమయంలో ఎక్కువ మందికి ఆపరేషన్ చేయాలంటే వేగంగా చేయాలని నిర్ణయించుకొని ప్రాక్టీస్ చేశాను' అని చెప్పారు.

## నేను – నా ఎడతెగని సందేహాలు :

నేను వారి నుంచి ఏదైనా అనుమానం తీర్చుకోవాలన్నా, వారితో సంభాషించాలనుకున్నా ఉదయాన్నే క్యాంటీన్ ముందు కాపుకాసేవాడ్ని. వారు కారు దిగగానే నమస్కరించి వారితో పాటు S2 వార్డు వరకు వెళ్ళేవాడిని. వారు నడుస్తుంటే నేను పరిగెత్తాల్సి వచ్చేది. నాకున్న రకరకాల సందేహాల్ని ఆకాస్త సమయంలో నివృత్తి చేసుకునేవాడిని. స్టూడెంట్స్ అసోసియేషన్ లో క్యాంటీన్ సెక్రటరీ గా ఉండగా వచ్చిన కొన్ని సమస్యలను కూడా ఆ సమయంలోనే వారితో చర్చిస్తుండే వాడిని. వారు ఒక ప్రొఫెసర్. నేను కేవలం మెడికల్ స్టూడెంట్ ని. కనీసం PG ని కూడా కాదు. చాలా చిన్నవాణ్ణి. అయినా ఒక్కసారి కూడా నన్ను విసుక్కోలేదు. ఒకే ఒక్కసారి మాత్రం నేను వారిని ఏదో అడుగుతుండగా వారు సమాధానం చెప్పకుండా నడక వేగాన్ని పెంచారు. వినపడలేదేమో అని మళ్ళీమళ్ళీ అడిగాను. ఎడమ చేతితో బ్రీఫ్ కేస్ పట్టుకుని ఉన్నారు. కుడి చేత్తో నన్ను 'ఆగు ఆగు' అన్నట్లు గా సంజ్ఞ చేశారు. నాకు అర్థం కాలేదు. నడక స్పీడ్ ఇంకా పెంచారు. గబగబా తన రూములోకి వెళ్లారు. ఆ రూము లో నేను ఆయన్ని చూడడం అదే మొదటి సారి. బ్రీఫ్ కేస్ పక్కన పెట్టి Wash basin వద్దకు వెళ్ళి భళుక్కున వాంతి చేసుకున్నారు. వెంటనే Wash basin ను శుభ్రం గా కడిగేశారు. వారు nausea తో బాధ పడుతుంటే నేను వారిని ఇంత ఇబ్బందిపెట్టానా అని చాలా బాధ పడ్డాను. ఆ సంఘటన తలుచుకుంటే నాకు ఇప్పటికి బాధే.

## విద్యార్థి నాయకులపై వారి అభిప్రాయం:

వారు వైస్ ప్రిన్సిపల్ గానూ, ఇన్ ఛార్జ్ ప్రిన్సిపల్ గా కూడానూ పనిచేశారు. స్టూడెంట్స్ అసోసియేషన్ మీటింగ్స్ ప్రిన్సిపల్ రూములో జరిగేవి. నేను క్యాంటీన్ సెక్రటరీ గా ఉన్నప్పుడు అసోసియేషన్ మీటింగ్స్ ను వారే నిర్వహించేవారు. ఎనాటమీ ప్రొఫెసర్ కాంతమ్మ గారితో సహా మరికొంతమంది ప్రొఫెసర్లు కూడా ఆ సమావేశాల్లో ఉండేవారు. చాలా సార్లు శర్మ గారు స్టూడెంట్ లీడర్స్ ని మెచ్చుకొనేవారు. మేమేం చెప్పినా ఓపికగా వినేవారు.

## మిలట్రీ లో ఉద్యోగం కోసం ఎగ్జామినేషన్ :

నేను షార్ట్ సర్వీస్ కమీషన్ లో ఉద్యోగం కోసం (మిలట్రీ లో ఉద్యోగం) దరఖాస్తు పెట్టడానికి ఫిజికల్ ఫిట్నెస్ సర్టిఫికేట్ అవసరమైంది. శర్మ గారికి ఈ విషయం చెప్పగానే తన రూముకు తీసుకెళ్లి నన్ను పూర్తిగా స్ట్రిప్ చేసి మరీ పరీక్ష చేశారు. ఇంత సీరియస్ గా పరీక్ష చేయాలా అని నేను ఎక్కడ అనుకొంటానో అని 'ప్రసాదూ! మిలట్రీ లో చేర్చుకోవాలంటే చిన్న తేడా ఉన్నా చేర్చుకోరు. ఆఖరికి పైల్స్ ఉన్నా సరే' అన్నారు.

## మిలట్రీ లో చేరితే తాగాలా :

వారు చైనాతో యుద్ధం జరిగినప్పుడు కొంత కాలం మిలట్రీ లో పని చేసేవారని చెప్పుకునేవారు. అందుకే నాకు మిలట్రీ లో ఉద్యోగం వచ్చిందని ఉత్తరం అందుకోగానే వారి వద్దకు వెళ్ళి 'సార్ నాకు ఆర్మీ లో ఉద్యోగం వచ్చింది. ఆ ఉద్యోగం లో చేరితే నేను ఆల్కహాల్ తీసుకోవాల్సిందేనా? నాకు అలవాటు లేదు, ఇష్టం లేదు' అని చెప్పి వారి సలహా అడిగాను.

'ప్రసాదూ మిలట్రీ లో 50 శాతం మంది ఆల్కహాల్ తీసుకోరు. నేనెప్పుడూ తాగలేదు. తాగని వాళ్ళను అక్కడ ఎవ్వరూ ఒత్తిడి పెట్టరు' అని ధైర్యం చెప్పారు.

## తన ఆచరణ ద్వారా ఉత్తేజపరచడం :

ఒకసారి OP లో క్లినిక్స్ పాఠం పూర్తవగానే "మన GGH లో సంవత్సరానికి 1000 బ్లడ్ బాటిల్స్ అవసరమవుతాయి. వైద్య విద్యార్థులేమో వెయ్యి మంది ఉన్నారు. ప్రతివారు తమ పుట్టిన రోజు నాడు ఒక సీసా రక్తదానం చేస్తే మన హాస్పిటల్ లో Professional Donors నుంచి మనం కొనుక్కోనవసరమే లేదు. ప్రతి నాలుగు నెలలకి ఒకసారి మనం రక్తదానం చేయవచ్చు. నేను రక్తం ఇచ్చి ఈరోజు తో నాలుగు నెలలు పూర్తయింది. ఇప్పుడు నేను మళ్ళీ అందుకు వెళ్తున్నాను. మీలో రక్తదానం చేద్దామనుకున్నవారు నాతో పాటు రావచ్చు" అని చెప్పి గబగబా blood bank కి నడిచి వెళ్ళిపోయారు. వారి వెనుకే మేమంతా పరిగెత్తుకుంటూ వెళ్లి వారి తర్వాత రక్తం ఇచ్చాము.

గుంటూరు మెడికల్ కాలేజీ లో మేము చదువుకునే సమయంలో ఒక సంవత్సరం మెడికల్ ఎగ్జిబిషన్ జరిగింది. గార్డెన్ లో ఉన్న ఒక స్టాల్ లో ని బల్లలపై నీళ్లు నిలిచి కాస్త అపరిశుభ్రంగా ఉన్నాయి. మేము అదేమీ పట్టించుకోకుండా కబుర్లు చెప్పుకుంటూ ఉన్నాము. అటువైపు వెళ్తూ ఆయన గమనించి గబగబా వచ్చి తన చేతులతో బల్లలన్నీ శుభ్రంగా తుడిచేశారు. మేమందరం సిగ్గుపడి అప్పటి నుంచి ఆ స్టాల్ ను శుభ్రంగా నిర్వహించాం.

ఇలా మాటలతో కాక తాను ఆచరిస్తూ మిగతా వారికి ఆదర్శంగా ఉండేవారు.

## What happened to my good girl ?

మాష్టారి కుమార్తె సుజాత మంచి స్టూడెంట్. అయినా $2^{nd}$ M.B.B.S లో ఒక సబ్జెక్ట్ ఫెయిల్ అయింది (కాదు – ఫెయిల్ చేశారు). ఫస్ట్ క్లాస్ స్టూడెంట్ అయిన సుజాత తప్పడం మాకందరికీ చాలా బాధగా అనిపించింది. మాష్టారు దగ్గరకి వెళ్ళి నా బాధను చెప్పాను. 'ఆ ప్రొఫెసర్ దగ్గరకు వెళ్ళి what happened to my good girl? అని అడిగాను ప్రసాదూ. Theory లో మార్కులు బాగానే వచ్చాయి కానీ ప్రాక్టికల్స్ లో పోయింది అన్నారు' అని నిరాశగా చెప్పారు.

## క్యాన్సర్ రోగులతో చెప్పిన విషయం – తలరాత :

వార్డులో రౌండ్స్ చేస్తున్నప్పుడు కాన్సర్ పేషెంట్స్ కు లివర్ లో మెటాస్టేసిస్ ఉంటే "మన విధి" అన్నట్లుగా బొటన వేలును నుదుటికి అడ్డంగా రాసి "ఇంటికి వెళ్ళిపోయి నెప్పి ఉన్నప్పుడు నల్ల మందు ఇప్పించండి" అని వారి బంధువులతో చెప్పేవారు. కాన్సర్ నెప్పి నివారణకు వాడే పెథిడీన్, మార్ఫిన్ ఇంజక్షన్లు చాలా ఖరీదు అని వారు ఈ నల్ల మందు మాత్రల సలహానిచ్చేవారు. 'నల్ల మందు ఎక్కడ దొరుకుతుందండీ' అని ఆసక్తిగా అడిగాను నేను ఒకసారి. 'ప్రతి ఊళ్ళో దొరుకుతుంది ప్రసాదూ' అన్నారు.

GJ vagotomy కు assist చేసినప్పుడు Stoma suture చేయడం:

చీఫ్ సర్జన్లు ఆపరేషన్ చేసేటప్పుడు సాధారణంగా అసిస్టెంట్స్ గానీ, PG లు గానీ సహకరిస్తుంటారు. హౌస్ సర్జన్సీ లో ఒక్కసారి నేను GJ vagotomy కేసు కు వారికి అసిస్ట్ చేశాను. Stoma ను straight needle catgut తో suture చేసేవారు. నీడిల్ గుచ్చిన తరువాత రెండవ ప్రక్కకు రాగానే non toothed forceps తో పట్టుకొని పూర్తిగా బయటకు లాగి నేను మళ్ళీ వారికి అందివ్వాలి. కానీ వారి స్పీడును నేను అందుకోలేకపోయాను. “ప్రసాదూ...!” అని నిట్టూర్చారు గానీ ఏ మాత్రం కోప్పడలేదు, విసుక్కోలేదు. Skin to skin 16 నిమిషాలలో చేసింది ఆ కేసే!

RSU వారిని పోలీసులు పట్టుకోవడానికి ప్రయత్నించినపుడు మేనేజ్ చేసిన విషయం :

ఒకసారి కాలేజీ వార్షికోత్సవం జరుగుతోంది. రాడికల్ స్టూడెంట్స్ యూనియన్ కు చెందిన మెడికల్ స్టూడెంట్స్ ను తీసుకువెళ్లడానికి పోలీసులు కాలేజీ గేటు బయట కాచుకొని ఉన్నారు. వీళ్ళు గేటు లోపల ఉండి పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు ఇస్తున్నారు. గేటు దాటితే వీళ్ళని పోలీసులు తీసుకుపోవడం తథ్యం. శర్మ గారికి తెలిసి గబగబా వచ్చి ఇద్దరికీ మధ్య నుంచొని పోలీసులు లోపలికి రావడానికి అనుమతించక, RSU వారిని నినాదాలు ఆపమని చెప్పారు. కానీ వారు పట్టించుకోకుండా అరుస్తూనే ఉన్నారు. స్వరం పెంచి వారికి మళ్ళీ మళ్ళీ చెప్పారు. శర్మ గారు చెప్పినా వినకపోవడంతో ఈ విద్యార్థుల మీద ఇదంతా చూసే వాళ్ళకు కోపం వచ్చింది. కానీ మాష్టారు మాత్రం కోపం తెచ్చుకోలేదు. కానీ ఆ రోజు వారిని అరెస్ట్ కాకుండా చూశారు.

ఇంటికి వెళ్ళి కోపాన్ని ఎలా జయించారు అని అడగడం:

‘మీతో కాసేపు మాట్లాడాలి మాష్టారూ ఇంటికి రావచ్చా’ అని అడిగాను. ‘సాయంత్రం 5 గంటలకు రా ప్రసాదూ’ అన్నారు. ఆరోజు సాయంత్రం 5 గంటలకు పట్టాభిపురం లోని వారింటికి వెళ్తే వయసులో చాలా చిన్న వాడిని అయినా సాదరంగా ఆహ్వానించారు. మా ఇద్దరి మధ్య నడిచిన సంభాషణ :

చాలా డిఫికల్ట్ టైమ్స్ లో మిమ్మల్ని గమనించాను. ఒక్కమారైనా మీరు కోపం ప్రదర్శించలేదు. సర్! మీరు కోపాన్ని ఎలా అణుచుకుంటారు? ఇది తెలుసుకోవాలనే నేను వచ్చానండి.

నాకసలు కోపం రాదు ప్రసాదూ.

కోపం రాకుండా ఎవరికి ఉంటుందండి. మీరు ఎలా అణుచుకుంటారో తెలుసుకోవాలని ఉంది నాకు.

లేదు ప్రసాదూ నాకసలు కోపం రాదు. వారు మా నాన్న గారు (కాస్త దూరంగా రవీంద్రనాద్ ఠాగూర్ లాగా గడ్డం పెంచుకొని ఉన్న ఒక పెద్దాయనను చూపించి) వారికి బాగా కోపం ఎక్కువ. వారి కోపం మా అబ్బాయికి వచ్చింది. మా అమ్మ గారికి అస్సలు కోపమే రాదు. ఆదే నాకూ వచ్చింది.

సర్ మీరు కోపం, శాంతం కూడా genetic గా వస్తాయంటున్నారా? అని నవ్వాను.

అవును ప్రసాద్.

నేను ఒప్పుకోను సార్ అన్నాను.

నవ్వారు ఆయన. నేను వారితో విభేదించినా ఏ మాత్రం విసుగు ప్రదర్శించలేదు.

ఇది వైస్ ప్రిన్సిపాల్ అయిన ఒక సర్జరీ చీఫ్ కు, ఒక వైద్య విద్యార్థికి మధ్య జరిగిన చర్చ. మామూలుగా ఏ చీఫ్ తోనూ ఒక వైద్య విద్యార్థి ఇలా మాట్లాడడం జరగదు. భయం, భక్తి తో వ్యవహరిస్తుంటాం. శర్మ గారు ప్రొఫెసర్ అయినా, ప్రిన్సిపల్ అయినా ఎవరూ భయపడేవారు కాదు. కానీ అందరికీ వారంటే భక్తే! – భక్తి తో కూడిన చనువు!

పై చర్చ జరిగిన 5 సంవత్సరాలు తరువాతగానీ నేను వారు చెప్పిన genetic సిద్ధాంతాన్ని నమ్మలేదు. రూపురేఖలు, రంగు – పొడుగు – పొట్టి వగైరాలు ఎలా తల్లితండ్రుల నుండి వస్తాయో అలాగే భావోద్వేగాలు కూడా వస్తాయని అర్థమైంది.

మా కజిన్ బయాప్సీ:

మా Cousin కు Cervical lymph nodes వాచినవి. OP లో ఒకరోజు శర్మ గారికి చూపించాను. Non specific lymphadenitis అంటారు అనుకొన్నాను. కానీ Excision biopsy కి పోస్ట్ చేసి వారే స్వయంగా ఆపరేషన్ చేశారు. Non Hodgkin's lymphoma (ఒకరకమైన కాన్సర్) అని రిపోర్ట్ వచ్చింది. నేను రిపోర్ట్ తీసుకొని వారి వద్దకు వెళ్ళాను. 'హైదరాబాద్ కాన్సర్ ఆసుపత్రికి తీసుకు వెళ్లు ప్రసాదు' అన్నారు. 'సర్ బయాప్సీ రిపోర్ట్ లో పొరబాటులు ఉండకూడదా' అన్నాను.
నా వంక చూసి 'రా ప్రసాదూ' అంటూ నన్ను తన కారులో ఎక్కించుకొని హాస్పిటల్ నుండి మెడికల్ కాలేజీ లోని పెథాలజీ డిపార్ట్మెంట్ కి నన్ను తీసుకువెళ్లారు. పెథాలజీ ప్రొఫెసర్ వేంకటరత్నం గారితో 'ఇతను ప్రసాదు. మన స్టూడెంట్. ఈ బయాప్సీ రిపోర్ట్ వీళ్ళ cousin ది. Slides మరొక్కసారి చూడగలరా' అని అడిగారు.

'ఇది చాలా క్లియర్ కట్ కేసండి. PG లందరికీ నిన్ననే డిమానిస్ట్రేట్ చేశాను. నేను కూడా ఆ slides ను డిపార్ట్మెంట్ లో అట్టిపెట్టాను' అని చాలా confident గా చెప్పారావిడ. నా భుజం మీద చేయి వేసి బయటకు తీసుకొచ్చి 'మన మేడమ్ Lymph node Biopsy లలో expert. మీ cousin ను హైదరాబాద్ తీసుకు వెళ్ళు' అని చెప్పారు.

నేను ఒక సాధారణ మెడికల్ స్టూడెంట్ ని. "బయాప్సీ లో పొరబాట్లు జరగకూడదా" అని నేనన్నప్పుడు "సెకండ్ ఓపీనియన్ తీసుకో" అని చెప్తే సరిపోయేది. కానీ వారు అలా చేయలేదు కాబట్టే ఇప్పటికీ ఆ సంఘటనను, ఆయనను నేను మర్చిపోలేకపోతున్నాను.

వారికి కాన్సర్ వచ్చినప్పుడు వైజాగ్ వెళ్ళి వారి అబ్బాయితో మాట్లాడడం :

1985 అక్టోబర్ లో డా. నల్లూరి రంగారావు గారి వద్ద పనిచేయడానికి నేను ఒంగోలు వెళ్ళాను. ఏదో ఒక సందర్భంలో శర్మ గారి గురించి వారికి నేను చెప్తుండేవాడిని. అప్పుడే శర్మ గారికి కాన్సర్ వచ్చిందని తెలిసింది. వారి అనుమతి తీసుకొని విశాఖపట్నం వెళ్ళాను. ఇంటికి వెళ్ళి వారి కుమారుని కలిశాను. 'నేను కొద్ది రోజుల క్రితమే అమెరికా వెళ్ళానండి. నాన్న గారు ఫోన్ చేసి తనకు కాన్సర్ వచ్చిన సంగతి చెప్పారు. అమెరికా కి వచ్చేయండి నేను ఇక్కడ వైద్యం చేయిస్తాను అని అన్నాను. ఏం జరగబోతోందో నీకు తెలుసు, నాకు తెలుసు. నువ్వే ఇక్కడకు వస్తే మీ అందరితో కలిసి ఉండడం నాకు సంతోషంగా ఉంటుంది అన్నారు. ఉద్యోగం మానుకొని నేను వచ్చేశానండి. నాన్న గారికి Infections రాకుండా ఉండడానికి visitors ను అనుమతించడం లేదండీ. మీరు ఈ పుస్తకం లో రాయండి నేను వారికి చూపిస్తాను' అని చెప్పారు. వచ్చిన visitors అందరూ ఆ పుస్తకం లో రాసి వెళ్తున్నారు. నిజమే కదా! Visitors ఎక్కువగా వస్తే వారి ఆరోగ్యానికి ఇబ్బందే కదా. అందుకే నేను కూడా ఆ పుస్తకంలో రాసి బరువు ఎక్కిన హృదయంతో తిరిగి వచ్చేశాను. ఏం రాశానో మాత్రం గుర్తులేదు.

ఆయన చనిపోయారని రంగారావు గారు చెప్పడం :

ఆ తరువాత కొద్ది రోజులకే శర్మ గారు చనిపోయిన విషయం హిందూ పేపర్ లో చదివానని డాక్టర్ రంగారావు గారు చెప్పారు. చాలా సేపు నాకు మాట రాలేదు. విశాఖపట్నం వెళ్ళడం సాధ్యం కాలేదు.

The man who never lost his temper:

శర్మ గారి ఫోటో క్రింద The man who never lost his temper అని రాయించి ఫ్రేమ్ కట్టించాను. చల్లపల్లి లో ప్రాక్టీస్ పెట్టినప్పుడు ఆయన ఫోటోను నా కుర్చీకి ఎదురుగా ఉండే గోడ పైన బిగించాను. నాకు కోపం వచ్చినప్పుడు వారి ఫోటో చూస్తే కోపాన్ని అణుచుకోవచ్చు అనుకునేవాడిని. కానీ ఒక హాస్పిటల్ administrator గా ఉన్నప్పుడు ఒకొక్కసారి కోప్పడక తప్పదు. కోపం వచ్చినప్పుడు నా పరిస్థితి విచిత్రంగా ఉండేది. ఎదురుగుండా మాష్టారు ఫోటో దాని క్రింద వ్రాసి పెట్టుకున్న caption నన్ను వెక్కిరిస్తున్నట్లు ఉండేది. ఈ ఫోటో ఒక వర్షాకాలంలో చెమ్మ వచ్చి కాస్త పాడైనప్పుడు నాకు బాధేసింది.

మాష్టారు కొంతకాలం Incharge Principal గా ఉండేవారు. సర్జరీ professor గా వారిది ఎంతో ఆదర్శప్రాయమైన, విజయవంతమైన జీవితం. కానీ కాలేజీ ప్రిన్సిపల్ గా వారిది పూర్తిగా విజయవంతమైన కాలం కాదు. వారెప్పుడు పొరపాటు చేయలేదు. కానీ ప్రిన్సిపల్ గా అనేక మందితో వ్యవహరించవలసి వచ్చేది. ఆ సమయంలో ఆ ఉద్యోగులు వీరితో 'ప్రిన్సిపల్ గారితో మాట్లాడుతున్నాం' అనే స్పృహ లేకుండా చాలా మామూలుగా ఒక్కొక్కసారి హెచ్చుస్వరంతో కూడా వ్యవహరించేవారు. ఆ సందర్భాలు కొన్ని చూసినప్పుడు నేను బాధ పడేవాడిని. కొంతమందిని అడిగాను కూడా 'ప్రిన్సిపల్ గారితో అలాగేనా మాట్లాడేది' అని. 'శర్మ గారు మన తోకలు కత్తిరించరు కదా' అని సమాధానం వచ్చేది. ఎవరినీ శిక్షించని మనస్తత్వం, గుర్తుపెట్టుకుని పరీక్షలలో తప్పించడం వంటివి చేయకపోవడం లాంటి మంచితనాల వలన వారి మాట కొంతమంది వినేవారు కాదు. అందరికీ వారంటే భక్తే గాని, కించిత్తు భయం కూడా ఉండేది కాదు. క్రింది వారికి ఎంతోకొంత భయం లేకపోతే administration లో నెగ్గుకురావడం కష్టమని నాకు వారి ద్వారా అర్ధమైంది.

హౌస్ సర్జన్సీ సమయంలో క్యాజువాలటీ లో జరిగిన సంఘటన:

క్యాజువాలిటీ లో హౌస్ సర్జన్ గా పనిచేస్తున్నప్పుడు రోగి తాలూకు మనిషి ఒకరు వచ్చి 'డాక్టర్ గారూ! నేను అంత డబ్బు ఇవ్వలేను, దీనితో సరిపెట్టుకోండి' అని చెవిలో చెప్పాడు.

నేను చాలా కోపంగా 'నిన్ను డబ్బులు ఎవరు అడిగారు? ఇక్కడ ఎవరికీ డబ్బులు ఇవ్వవలసిన అవసరం లేదు' అన్నాను. క్యాజువాలిటీ లోని ఒక ఉద్యోగి పేరు చెప్పి అతనే డబ్బులు అడిగాడని చెప్పారు. అతన్ని పిలిచి నేను గట్టిగా రోగుల దగ్గర డబ్బులు అడుగుతున్నావా అని కోప్పడ్డాను.

'CMO గారి కోసం అడిగానండి' అని చెప్పాడు.

'ఈ CMO గారు డబ్బులు తీసుకుంటారా' అని ఆశ్చర్యంగా అడిగాను.

'అదేంటి సార్ శర్మ గారు, అంజి రెడ్డి గారు తప్పితే ఈ హాస్పిటల్ లో డబ్బులు తీసుకోని వారు ఎవరండి?' అన్నాడు. ఇంత పెద్ద హాస్పిటల్ లో కేవలం ఇద్దరు డాక్టర్లు మాత్రమే నిజాయితీపరులా అని అక్కడ ఉన్న హౌస్ సర్జన్లమంతా ఆశ్చర్యపడ్డాం.

My Children are my assets :


"మాకు విశాఖపట్నంలో ఇల్లు ఉంది. ఈ కారు, ఆ ఇల్లే మా ఆస్తి. అంతకంటే My Children are my assets. మా ఇద్దరికీ వచ్చే జీతాలు మాకు చాలు. నాకు విశాఖపట్నం అంటే చాలా ఇష్టం. అక్కడ ఉండడం నాకు సంతోషం ప్రసాదూ!" అన్నారు నాతో ఒకసారి. నా స్నేహితులు నన్ను డి. ఆర్. కె అని పిలుస్తారు. వారు మాత్రం ప్రసాదూ అని పిలిచేవారు.

ముగింపు :

డా. E.N.B. శర్మ గారి గురించిన నాకు తెలిసిన విషయాలను పది మందితో పంచుకోవడం కోసం ఇలా రాయాలని ఎప్పటినుంచో అనుకొంటున్నాను. డాక్టర్ భార్గవి వారి సంపూర్ణ వ్యక్తిత్వాన్ని ప్రతిబింబించేటట్లు చక్కటి వ్యాసం రాశారు. నా అనుభవాలు రాయమని ప్రోత్సహించారు. పైన రాసిన అనుభవాలన్నీ నాకు ఎప్పుడూ గుర్తుకొచ్చేవే!

ఈ అనుభవాలన్నీ నేను చెప్తుంటే మా రిసెప్షనిస్ట్ ప్రసాదు టైప్ చేశాడు. మధ్యమధ్యలో నాకళ్ళు చమర్చాయి. నిరంతరాయంగా చెప్పలేకపోయాను. ఆయన లేరని ఎందుకో నాకిప్పటికీ అనిపించడం లేదు.

సౌజన్యం మూర్తీభవించిన – ఆదర్శం శిఖరాగ్రానికి చేరిన – వ్యక్తి ధర్మంలో పరిపూర్ణుడైన – ఎవ్వరు ఎప్పుడైనా గౌరవింపదగిన ఇటువంటి డాక్టరు ఒకాయన ఒకప్పుడు ఈ దేశంలో ఉండేవారని ఇప్పటి డాక్టర్లకు నమ్మకం కలిగించడానికి డాక్టర్ శర్మ గారి గురించి తమకు తెలిసిన విషయాలను మరింత మంది రాయాలని నా కోరిక.





డా. డి. ఆర్. కె. ప్రసాదు
చల్లపల్లి
18.03.2020.